ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు
3★
గురువారం 3 అక్టోబరు 2024

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి 6లో..

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి 5లో..

మహిళా ఓటర్లే అధికం



- 269 పంచాయతీలు, 2,436 వార్డుల వారీగా ఓటర్ల జాబితా ఖరారు
- మొత్తం ఓటర్లు 4,07,716
- పురుషులు 2,01,006 మంది ఓటర్లు
- మహిళలు 2,06,697 మంది ఓటర్లు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని గ్రామపంచాయతీల్లోనూ మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. గతనెల 28వ తేదీ నాటికి గ్రామపంచాయతీలు, వార్డుల వారీగా తుది ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. జిల్లాలోని 269 గ్రామపంచాయతీలోని 2,436 వార్డుల్లో 4,07,716 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 2,01,006మంది ఓటర్లు, మహిళలు 2,06,697 మంది ఓటర్లు, ఇతరులు 13 మంది ఉన్నారు. ఇందులో పురుషుల కంటే మహిళా ఓటర్లు 5,691 మొత్తం మంది అధికంగా ఉన్నారు. గ్రామ పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ఫిబ్రవరి రెండవ తేదీతో ముగిసిన విషయం తెలిసిందే. దీంతో తిరిగి పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉండగా, పార్లమెంటు ఎన్నికల షెడ్యూలు మార్చి నెలలో వెలువడడంతో ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ముందుకు రాలేదు. పార్లమెంటు ఎన్నికల ఫలితాలను జూన్ మొదటి వారంలో ప్రకటించగా రెండు రోజుల అనంతరం ఎన్నికల కోడ్ ముగిసింది. ఆ వెంటనే పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తుందని అంతా భావించారు. గత ప్రభుత్వ హయాంలో నూతన పంచాయతీరాజ్ చట్టాన్ని తీసుకురాగా, సర్పంచ్, వార్డు సభ్యులకు రొటేషన్ పద్ధతిలో ఇచ్చే రిజర్వేషన్లు పది ఏళ్లకు పెంచింది. ఈ ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో మరికొన్ని గ్రామపంచాయతీలు ఏర్పాటు కాగా, పాత రిజర్వేషన్ల విధానంతో ఎన్నికలు నిర్వహిస్తే ఇబ్బంది అవుతుందని, ప్రభుత్వం పంచాయతీరాజ్ చట్టానికి సవరణ చేయాలని భావించింది. అలాగే బీసీ కులగణన చేపట్టేందుకుగాను అసెంబ్లీ తీర్మానం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బీసీ కులగణన చేపట్టే వరకు ఎన్నికలను నిర్వహించవద్దని బీసీ సంఘాలతో పాటు ప్రతిపక్ష పార్టీలు కూడా డిమాండ్ చేస్తున్నాయి. బీసీ కులగణన పూర్తిచేసేందుకు మరో నాలుగు ఐదు మాసాలు పట్టే అవకాశాలు ఉన్నాయి. దానికంటే ముందు ఎన్నికలకు అధికారికంగా అయ్యేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేపట్టింది.

అసెంబ్లీ ఎన్నికల జాబితాను బట్టి గ్రామపంచాయతీలు, వార్డుల వారిగా ఓటర్ల ముసాయిదాను పూర్తి చేసి సెప్టెంబర్ 13వ తేదీన ప్రకటించారు. గత నెల 14వ తేదీ నుంచి 21 వ తేదీ వరకు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించారు. 18వ తేదీన జిల్లా స్థాయిలో కలెక్టర్ అన్ని రాజకీయ పార్టీలతో, 19వ తేదీన మండల స్థాయిలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించి వారి సలహాలు సూచనలను స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 1,716 మంది ఓటర్లపై అభ్యంతరాలు రాగా వాటిని 26వ తేదీ వరకు పరిష్కరించారు. సెప్టెంబర్ 28వ తేదీన ఓటర్ల తుది జాబితాను కలెక్టర్ కోయ శ్రీహర్ష, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్య విడుదల చేశారు. అన్ని జాబితాలను మండల పరిషత్ కార్యాలయాల వద్ద, గ్రామ పంచాయతీ కార్యాలయ వద్ద ప్రదర్శించారు. ముసాయిదా జాబితాలో ప్రకటించిన ఓటర్లపై వచ్చిన అభ్యంతరాల్లో మొత్తం 336 మంది ఓటర్లను తొలగించారు. జిల్లా పంచాయతీ అధికారులు ఓటర్ల జాబితాను పూర్తి చేయగా, వార్డుల వారీగా పోలింగ్ బూతుల ఏర్పాటుకు సిద్ధం అవుతున్నారు. పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూలు ప్రకటించగానే ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సన్నద్ధంగా ఉండేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

క్రసం	మండలం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
1.	అంతర్గాం	9,897	10,291	01	20,189
2.	ధర్మారం	21,076	21,715	02	42,793
3.	ఎలిగేడు	8,982	9,334	01	18,317
4.	జూలపలి	11,818	12,010	00	23,828
5.	కమాన్‌పూర్	9,764	10,081	00	19,845
6.	మంథని	16,675	17,527	04	34,206
7.	ముత్తారం	11,136	11,609	01	22,746
8.	ఓదెల	17,299	17,813	00	35,112
9.	పాలకుర్తి	15,472	15,703	00	31,175
10.	పెద్దపల్లి	24,520	25,350	01	49,871
11.	రామగిరి	18,712	18,568	01	37,281
12.	రామగుండం	0	0	0	0
13.	కాల్వశ్రీరాంపూర్	16,853	17,173	01	34,027
14.	సుల్తానాబాద్	18,802	19,523	01	38,326
మొత్తం		2,01,006	2,06,697	13	4,07,716

మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతీ ఒక్కరికి ఆదర్శం

- కలెక్టర్ కోయ శ్రీహర్ష



గాంధీ జయంతి వేడుకలలో పాల్గొన్న కలెక్టర్, అదనపు కలెక్టర్

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 2 : మహాత్మాగాంధీ జీవన విధానం ప్రతి ఒక్కరికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి జ్యోతిప్రజ్వలన చేసి గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మాగాంధీ జీవితంలో ఎప్పుడు షార్ట్‌కట్స్ వెతుక్కోలేదని, న్యాయబద్ధంగా ఓపికతో పోరాడుతూ అనేక విజయాలు సాధించారన్నారు. దీనిని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని, నిరంతరాయంగా లక్ష్యం కోసం శ్రమిస్తే ఫలితం లభిస్తుందని కలెక్టర్ తెలిపారు. అనంతరం మహాత్మ గాంధీ స్మారక నిధి వారు రూపొందించిన సూక్తుల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఆదిరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రమోద్ కుమార్, కలెక్టరేట్ సీ సెక్షన్ పర్యవేక్షకులు ప్రకాష్, స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశం, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కేంద్రంలోని నగర కేంద్ర గ్రంథాలయంలో జరిగిన గాంధీ జయంతి వేడుకలు భాగంగా లైబ్రేరియన్ సిబ్బంది పాఠకులు కలిసి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఆయన సేవలను కొనియాడారు.

మహాత్ముడి జీవితం అందరికీ ఆదర్శం : సీపీ



నివాళులర్పిస్తున్న సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, అక్టోబరు 2: మహాత్మాగాంధీ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శమని రామగుండం పోలీస్‌కమిషనర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ దామోదర్, మల్లేషం, ఆర్ ఎస్ఐలు అనీల్, శ్రావణి, పోచలింగం పాల్గొన్నారు.

నిత్య అల్పాహారం అందించడం అభినందనీయం

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 2: రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో భాగంగా 365 రోజులు పూర్తిచేసుకున్న ఉచిత నిత్య అల్పాహార వేడుకలు బుధవారం గోదావరిఖనిలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన లయన్స్‌క్లబ్ మాజీ డిస్ట్రిక్ గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి కేక్‌కట్ చేసి పేదలకు అల్పాహారం అందజేశారు. ప్రమోద్‌కుమార్‌రెడ్డి, సీనియర్ సభ్యులు కోదండరాం, బదేషం, వెంకటరమణారెడ్డి, బంకరామస్వామి, కె.రాజేందర్, గంగాధర్, తిలక్‌చక్రవర్తి, గుండా వీరేశం, పోకల అంజనేయులు పాల్గొన్నారు.

నేటి నుంచి భవానీ దీక్షలు ప్రారంభం

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 2: దేవీశరన్నవరాత్రోత్సవాలలో భాగం గురువారం నుంచి భవాని మాలదీక్షలు స్వీకరణ ప్రారంభమవుతుందని గోదావరిఖని భవానీ యజ్ఞదీక్ష సమితి వ్యవస్థాపకులు కట్ట సురేష్‌భవాని ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు గురువారం నుంచి మాల దీక్షలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు



జిల్లా కేంద్రంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



సుల్తానాబాద్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోదావరిఖనిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

పెద్దపల్లి కల్చరల్, అక్టోబరు 2 : ఆడబిడ్డల ఆత్మీయ పూల పండుగ ఎంగిలిపూల బతుకమ్మ వేడుకలు బుధవారం ఘనంగా మొదలయ్యాయి. తీరొక్క పూలతో ఉదయమే కొత్త బట్టలు కట్టుకొని బతుకమ్మలను పేర్చుకోని సాయంకాలం కాలనీ ఆడబిడ్డలంతా పాటలు పాడుకుంటూ కాలనీ కూడళ్లలో బతుకమ్మలను పెట్టి బతుకు పాటల చప్పట్లతో దరువు వేశారు. పెద్దపల్లి పట్టణంలో ఎల్లమ్మగుండమ్మచెరువు ట్యాంక్ బండ్‌పైన, కంచరి బావి వద్ద, శివాలయం వద్ద అమర్‌నగర్, జెండా కూడలి, భూం నగర్, ప్రగతినగ ర్, హనుమాన్‌నగర్, శాంతినగర్, జండా కూడళ్లలోనూ, కాలనీకూడళ్లలోను, దేవాలయాల సమీపంలోనూ బతుకమ్మలను ఉంచి ఆటలాడారు. అనంతరం బతుకమ్మలను చెట్ల కింద, ఆలయాల ఎదుట నిమజ్జనం చేసి సత్తుపిండి వాయినాన్ని పంచుకున్నారు. పెద్దపల్లి పట్టణ ప్రజలకు ఎమ్మెల్యే సీహెచ్ విజయరమణా రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ మమతారెడ్డి ఆడబిడ్డలకు పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

పెద్దపల్లి రూరల్ : మండలంలోని 30 గ్రామాల్లో బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుకలు శోభాయమానంగా నిర్వహించారు. బతుకమ్మ వేడుకలకు సుదూర ప్రాంతాల నుండి మహిళలంతా స్వగ్రామాలకు తరలిరావడంతో గ్రామాలన్ని సందడి వాతావరణం నెలకొంది.

సుల్తానాబాద్ : సుల్తానాబాద్ పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలో బతుకమ్మ సంబరాలు ప్రారంభమయ్యాయి. బుధవారం సాయంత్రం మహిళలు పిల్లలతో సహా బతుకమ్మ ఆడి సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని వేణుగోపాల స్వామి, పాత శివాలయం, పాత జెండా, కాపు వాడ, పోచమ్మ వీది, గాజులవాడ వైశ్య భవన్, స్వప్నకాలనీ, శ్రీరాంనగర్, గాంధీనగర్, గౌడవీధి, రజకవాడ, చెరువు రోడ్డు, గుడిమిట్ట, యాదవనగర్, నీరుకుళ్ల రోడ్డు తదితర వాడల్లో బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు.

ఓదెల : మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎంగిలి పూలబ తుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో, పాఠశాలల్లో, కూడళ్లలో బతుకమ్మలు ఆడి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకను నిర్వహించారు. అలాగే బతుకమ్మ ఆటస్థలాల్లో విద్యుత్ దీపాలు, ఏర్పాటు చేయడంలో గ్రామకార్యదర్శులు విఫలమాయ్యరు. ఓదెల హైస్కూల్‌తో పాటు పాఠశాల మైదానాల్లో కనీసం విద్యుత్ సౌకర్యం కల్పించకపోవడంతో మహిళలంతా తీవ్ర నిరాశకు గురయ్యారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని ఆయాగ్రామాల్లో బుధవారం ఎంగిలి పూల బతుకమ్మ వేడుక వైభవంగా జరిగింది. మహిళలు తంగేడు పువ్వుతో పాటు గుమ్మడి, గునుగు, రకరకాల పూలతో బతకమ్మను పేర్చి ఆయా గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో బతుకమ్మలు ఆనందంగా ఆడారు. అనంతరం ఆయాగ్రామాల్లోని చెరువు, కుంటల్లో బతుకమ్మలను నిమజ్జ నం చేశారు. ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు, గ్రామ కార్యదర్శిలు ఆటలాడే స్థలంలో లైట్లతో పాటు పలు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

జూలపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భక్తిశ్రద్ధలతో మహిళలు పాల్గొన్నారు. తీరొక్క పూలతో తయారుచేసిన బతుకమ్మలను వాడవాడలోని ముఖ్య కూడళ్లలో ఏర్పాటు చేసిన వేడుకల్లో ఉత్సాహంగా పాల్గన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంథని : బతుకమ్మ పండుగ వేడుకలు మంథని డివిజన్‌లో బుధవారం సాయంత్రం వైభవంగా ప్రారంభమయ్యాయి. మహిళలు ఎంగిలిపూల బతుకమ్మలు పేర్చి ఆడిపాడి ఊరు.. వాడల్లో ఆడబిడ్డలు సందడి చేశారు. ఉదయం నుంచి తంగేడు, రాచగుమ్మడి, గోరింట, కట్ల, సీత జెడలు, గులాబీలు, మందారాలు వంటి రకరకాల పూలను సేకరించిన మహిళలు, పిల్లలు మధ్యాహ్నం బతుకమ్మలను పేర్చి సాయంత్రం గ్రామాల్లోని ప్రధాన కూడళ్ళ వద్ద బతుకమ్మలను పెట్టి పాటలు పాడుతూ బతుకమ్మ ఆటలాడి అనంతరం నిమజ్జనం చేశారు. అనంతరం గౌరమ్మ వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. మంథని మున్సిపల్ చైర్ పర్సన్ పెంద్రి రమ, మాజీ చైర్‌పర్సన్ పుట్ట శైలజ, వివిధ రాజకీయ పార్టీల మహిళా నేతలు పలుచోట్లు మహిళలతో బతుకమ్మ ఆటలు ఆడి సందడి చేశారు.

కళ్యాణ్‌నగర్ /మార్కండేయకాలనీ : గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వాడవాడలా బతుకమ్మల పాటలు, ఆడ పడుచుల చప్పట్లతో మారుమోగాయి. ఆటలతో కనువిందు చేశాయి. రాత్రి 11గంటల వరకు ఆటపాటలు ఆడి బతుకమ్మలను గోదావరి, ఆలయాల వద్ద నిమజ్జనం చేసి వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. మార్కండేయకాలనీలో జరిగిన బతుకమ్మ వేడుకల్లో బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. గోదావరిఖని వన్‌టౌన్ సీఐ ఇంద్రసేనా రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.



ఓదెలలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కాల్వశ్రీరాంపూర్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మంథనిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఫార్వార్డ్ చేసినా కేసులు : సీపీ

కోల్‌సిటీ, అక్టోబరు 2: సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఫార్వార్డ్ చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని రామగుండం పోలీస్ కమిష నర్ శ్రీనివాస్ హెచ్చరించారు. కమిషనరేట్ పరిధిలో కొంత మంది ట్విట్టర్, ఫేస్‌బుక్, వాట్సాప్, యూట్యూబ్, ఇతర సామాజిక మాధ్యమాల వేదికగా రాజకీయ నేతలు దేవుళ్లు, మతాలకు సంబంధించి ప్రముఖులను టార్గెట్‌గా చేసుకుని రెచ్చగొట్టే పోస్టులు పెడుతున్నారన్నారు. వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసుకుని ప్రజలను, ధర్నాలు, రాస్తారోకోలు, గొడవలు, లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టించే విధంగా రెచ్చగొట్టే విధంగా సందేశాలు పంపుతున్నారన్నారు. ఒక వర్గాన్ని, వ్యక్తులను కించపరుస్తూ పోస్టు చేసినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో పుకార్లు ప్రచారం చేసినా జైలుకు వెళ్లాల్సి ఉంటుందని హెచ్చరించారు. అలాంటి వారికి జైలు శిక్ష, జరిమా నాతో పాటు కేసు తీవ్రతను బట్టి జీవిత ఖైదు కూడా పడే అవకాశముంటుందన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టే ముందు, ఫార్వార్డ్ చేసే ముందు అవి నిజమా, కాదా అని ఒకసారి ఆలోచించుకోవాలన్నారు. సోషల్ మీడియా ట్రాకింగ్ సెంటర్ (ఎస్ఎంటీసీ) ద్వారా సోషల్ మీడియా పోస్టులపై 24గంటలు నిఘా పెడుతున్నామ ని పేర్కొన్నారు. కొందరు ఐపీ అడ్రస్‌లు మార్చి ఏమార్చే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. వ్యక్తిగత ప్రొఫైల్ డీపీల్లో మారణాయుధాలతో ఉన్న ఫోటోలను పెడుతున్నారని, వాటిని తొలగించకపోతే కేసులు నమోదుచేస్తామని సీపీ హెచ్చరించారు.

దసరా సెలవులకు వెళ్లే వారు జాగ్రత్తలు పాటించాలి

దసరా సెలవులకు సొంత ప్రాంతాలు, బంధువుల ఇండ్లకు, విహార యాత్రలకు కుటుంబాలతో వెళ్లేవారు తమ ఇండ్లలో దొంగతనాలు జరుగకుండా అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో సూచించారు. ఊరికి వెళ్లాల్సి వస్తే విలువైన బంగారం, వెండి ఆభరణాలు డబ్బులు బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలని లేదంటే ఇంట్లోని రహస్య ప్రదేశాల్లో దాచుకోవాలన్నారు. బీరువా తాళాలను ఇంట్లో ఇతరులకు అందుబాటులో ఉంచవద్దని, తమతోపాటే తీసుకెళ్లాలన్నారు. ఊరికి వెళ్లే వారు తప్పనిసరిగా స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు నమోదు చేసుకుని ఇండ్లపై నిఘా ఏర్పాటు చేస్తామని సీపీ తెలిపారు. ఆన్‌లైన్‌లో రూ.1000లకే సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్నాయని, అవి ఏర్పాటు చేసుకోవడం వల్ల లక్షల రూపాయల ఆస్తులకు రక్షణ ఉంటుందన్నారు. అనుమానస్పద వ్యక్తులు సంచరిస్తే 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయండి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీ, అక్టోబరు 2: రామగుండం నగర పాలక సంస్థకు ప్రభుత్వం టీయూఎఫ్ఐడీసీ ద్వారా రూ.100కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఈ అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. బుధవారం నగరపాలక సంస్థలో గాంధీ జయంతి వేడుకలకు హాజరైన ఆయన ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలో పలు చోట్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అభివృద్ధి పనులను వెంటనే మొదలు పెట్టాలన్నారు. వర్షాలు కూడా తగ్గుముఖం పట్టినందు వల్ల పనులకు ఆటంకం కలుగదన్నారు. ఈ పనులు పూర్తయితేనే కొత్త నిధులు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుందని, పనుల్లో వేగం పెంచాల్సిన అవసరం ఉందన్నారు. బతుకమ్మ పండుగ ఏర్పాట్లకు సంబంధించి నగర పాలక సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టాలని, మహిళలకు ఇబ్బందులు కలుగకుండా లైటింగ్, ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ అనీల్ కుమార్, ఇంజనీరింగ్ అధికారులు, కార్పొరేటర్లు ఉన్నారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్ ఆత్మహత్య

వీణవంక, అక్టోబరు 2 : మండలంలోని ఎల్బాక గ్రామానికి చెందిన బొల్లం దేవేందర్‌రెడ్డి (30) ఎక్సైజ్ కానిస్టేబుల్ పురుగుల మందుతాగి ఆత్మహత్య చేసుకున్నాడు. దేవేందర్‌రెడ్డి నాలుగు సంవత్సరాలుగా హుజూరాబాద్ ఎక్సైజ్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. ఉద్యోగం వచ్చినా పెళ్లి కావడం లేదని మానసికంగా కుంగిపోయి జీవితంపై విరక్తిచెంది మంగళవారం గడ్డి మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్ అనుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. దేవేందర్‌రెడ్డి తండ్రి సంపత్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిరుపతి తెలిపారు.

సెమీ ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు



సెమీ ఫైనల్‌కు చేరిన ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు

కరీంనగర్, అక్టోబరు 2 : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్‌లో నిర్వహిస్తున్న అంతర్ జిల్లా అండర్-19 క్రికెట్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సెమీఫైనల్‌కు చేరింది. బుధవారం జిల్లా జట్టు రెండవ రౌండ్‌లో నిజామాబాద్‌తో తలపడి అద్భుత విజయం సాధించి సెమీ ఫైనల్‌కు ప్రవేశించింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన ఉమ్మడి జిల్లా జట్టు 50 ఓవర్లలో 193 పరుగులకు ఆల్ అవుట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 30 ఓవర్లలో 74 పరుగులకే ఆల్ ఔట్ అయి ఓటమి పాలైంది. ఉమ్మడి జిల్లా జట్టు నుంచి హర్షిత్ 5 వికెట్లు, సయ్యద్ ఆక్వారమ్ 3 వికెట్లు, విగ్నేష్ 55 పరుగులు, ఆఫ్రిది 36 పరుగులు చేశారు. మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా హర్షద్ ఎంపికయ్యాడని జిల్లా జట్టు మేనేజర్, జిల్లా క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు పి మనోహర్‌రావు తెలిపారు. ఈ జట్టును జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వి ఆగమ్‌రావు, ఎన్ మురళీధర్‌రావు, సిహెచ్ అజయ్‌కుమార్, విద్యాసాగర్‌రావు, శ్రవణ్‌కుమార్ అభినందించారు.

కోరుట్ల మున్సిపల్‌కు.. స్వచ్ఛ భారత్ దివస్ పురస్కారం

● ఢిల్లీలో అందుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్

కోరుట్ల, అక్టోబరు 2: స్వచ్ఛ భారత్ దివస్ పురస్కారానికి కోరుట్ల మున్సిపల్ ఎంపికైంది. కాగా బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య-అనిల్, కమిషనర్ తిరుపతి, డీఎంఏ గౌతమ్ సారథ్యంలో పురస్కారాన్ని అందుకున్నారు. స్వచ్ఛభారత్ దివస్ పురస్కరించుకొని స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛభారత్ మిషన్ ప్రారంభమై పది సంవత్సరాలు గడిచిన సందర్భంగా పుస్కారాలను అంద జేశారు. రాష్ట్రంలో నాలుగు మున్సిపాలిటీలు ఎంపిక కాగా దానిలో కోరుట్ల మున్సిపల్ ఉంది. ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పురస్కారాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్ అందుకున్నారు. సమావేశంలో ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సందేశ సమావేశంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య మాట్లాడుతూ కోరుట్ల మున్సిపల్ స్వచ్ఛతా హీ సేవా పురస్కారానికి ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. దీనికి కృషి చేసిన మున్సిపల్ కమిషనర్ తిరుపతి, మున్సిపల్ సిబ్బంది, పట్టణ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు.



ఢిల్లీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న కోరుట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

మంథని, అక్టోబర్ 2 : ఆరేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. స్థానిక శివకిరణ్ గార్డెన్స్‌లో బుధవారం జరిగిన పోషణ్ మహా-24 ముగింపు కార్యక్రమంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడారు. పుట్టిన పిల్లల నుంచి 6 సంవత్సరాల వయస్సు వరకు మంచి పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన పిల్లలు తయారవుతారన్నారు. పిల్లలకు మంచి పోషకాలు అందించాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం పోషణ్ మహా-24 కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో గర్భిణులు, మహిళలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీలు ప్రభుత్వం చేపడుతున్న అనేక కార్యక్రమాల అములులో కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ఐసీడీఎస్‌లో జిల్లాల్లో టీచర్, హెల్పర్ పోస్టులు ఖాళీగా ఉంటే వాటిని వెంటనే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు ప్రతిపాదనలు రూపొందించాలని సూచించారు. పౌష్టికాహారంలో నాణ్యతలో ఎక్కడ లోపం లేకుండా అందరికి పౌష్టికాహారం అందించాలన్నారు. అంగన్‌వాడీలకు ఆరోగ్య పరిస్థితులు చెక్ చేసేందుకు ప్రత్యేక మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలన్నారు.

లోపం ఉన్న పిల్లలను గుర్తించి నివారణ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలు పూర్వ విద్యా కేంద్రాలుగా మారుతున్నాయన్నారు. కరదీపిక, ప్రదర్శిని ప్రకారం పిల్లలకు ఆట పాటలతో బోధన చేయాలన్నారు. పోషక లోపాలు, శుభ్రతపై పిల్లలు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలామృతం తప్పనిసరిగా అందించాలన్నారు. విలోచవరం సెంటర్ శిలాఫలకాన్ని, స్వచ్ఛతా హీసేవ పోస్టర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు ఆవిష్కరించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, సీమంతాలు చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, డీడబ్ల్యూవో రౌఫ్ ఖాన్‌లు పాల్గొన్నారు.



సీమంతాల కానుకలు అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

మహిళతో పరిచయం పెంచుకుని బంగారం చోరీ

● ఇద్దరు నిందితుల అరెస్టు
● 187 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ

కరీంనగర్ క్రైం, అక్టోబరు : ఓ మహిళా కిలాడి కరీంనగర్ ప్రగతినగర్‌కు చెందిన మహిళతో చనువుగా ఉంటూ కొంతకాలంగా పరిచయం పెంచుకుని నమ్మించింది. బాధితురాలి ఇంటికి తరచుగా వస్తూ ఆమె కదలికలను గమనించింది. బంగారు ఆభరణాలు భద్రపరిచిన చోటును పసిగట్టి బాధిత మహిళ ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో బంగారు ఆభరణాలను దోచుకెళ్లింది. కరీంనగర్ ప్రగతినగర్‌లో ఇటీవల జరిగిన దొంగతనం కేసులో ఇద్దరు నిందితులను బుధవారం కరీంనగర్ రెండో ఠాణా, సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల వద్ద నుంచి 187 గ్రాముల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కరీంనగర్ టౌన్ ఏసీపీ జి నరేందర్, సీసీఎస్ ఏసీపీ కాశయ్యలు విలేకరులకు వివరాలు వెల్లడించారు. ప్రగతినగర్‌లో అద్దెకు నివాసం ఉంటున్న పిట్టల లహరి సెప్టెంబరు 24న ఉదయం 11:30 గంటలకు ఇంటికి తాళం వేసి ఇంటి యజమానురాలితో కలిసి షాపింగ్‌కు వెళ్లింది. తిరిగి 2:30 గంటలకు ఇంటికి వచ్చేసరికి ఇంటిలోని వెనుక వైపు తలుపు తెరచి ఉంది. అనుమానంతో కప్ బోర్డులో చూడగా తన బంగారు ఆభరణాలు కనిపించలేదు. దొంగతనం జరిగినట్లుగా తెలుసుకున్న బాధితురాలు లహరి వెంటనే డయల్ 100కు ఫోన్ చేసి తెలిపింది. కరీంనగర్ టౌన్ ఏసీపీ, రెండో ఠాణాఫా సీఐ విజయ్‌కుమార్‌లు హుటాహుటిన దొంగతనం జరిగిన చోటుకు వెళ్లి విచారణ జరిపారు. అయితే నిందితురాలు త్రిపురాని లహరి అలియాస్ శిరీష ప్రగతినగర్‌లోనే నివాసం ఉంటూ బాధితురాలు పిట్టల లహరికి పరిచయం అయింది. ఈ పరిచయంతో తరచుగా ఇంటికి వస్తూ వెళ్లేది. ఇదే క్రమంలో దొంగతనం జరిగిన ముందు రోజు కూడా నిందితురాలు బాధితురాలి ఇంటికివచ్చి చాలాసేపు గడిపింది. మాటల్లో షాపింగ్‌కు వెళ్తున్నట్లు తెలుసుకుని ఎవరికీ తెలియకుండా ఇంటి వెనుక వైపున డోర్‌కు గొళ్లెం తీసి పెట్టింది. పథకం ప్రకారం మరుసటిరోజు పిట్టల లహరి షాపింగ్‌కు వెళ్లినట్లు నిర్ధారించుకున్న తరువాత నిందితురాలు, తన బంధువు మంచిర్యాలకు చెందిన చిలుకాని రాజశేఖర్‌ను వెంట తీసుకుని వెళ్లి అతన్ని ఇంటి బయట కాపలా ఉంచి లోపలికి వెళ్ళి బంగారు ఆభరణాలు దొంగిలించింది. పోలీసులు విచారణలో భాగంగా సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈక్రమంలో బుధవారం ఇద్దరు నిందితులు ముకరంపురలో బంగారు ఆభరణాలు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా అదుపులోకి తీసుకుని విచారించగా నేరం ఒప్పుకున్నారు. నిందితులను కోర్టులో హాజరు పరిచారు. ఈ విలేకరుల సమావేశంలో రెండో ఠాణా ఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ సురేందర్‌పాల్‌సింగ్, కానిస్టేబుల్ అనిల్, మహిళా కానిస్టేబుల్ అనిత పాల్గొన్నారు.



నిందితులను అరెస్టు చూపుతున్న టౌన్ ఏసీపీ నరేందర్

బతుకమ్మ, దసరా పండుగలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

భగత్‌నగర్, అక్టోబరు 2: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నట్లు కరీంనగర్ రీజినల్ మేనేజర్ సుచరిత ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 810 బస్సులు, కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 850బస్సులు నడిపిస్తున్నామన్నారు. ఈనెల 10న బతుకమ్మ, 12న దసరా పండుగలను పుర్కరించుకుని జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 1వ తేదీ నుంచి 11వతేదీ వరకు, కరీం నగర్ నుంచి జేబీఎస్‌కు 12వ తేదీ నుంచి 21వరకు ప్రత్యే క బస్సులు నడిపిస్తున్నామన్నారు.

● జేబీఎస్ నుంచి కరీంనగర్‌కు 1వ తేదీన 130 బస్సులు, 2న 50, 3వ తేదీన 20, 4న 20, 5వ తేదీన 130, 6వ తేదీన 70, 11వ తేదీన 40బస్సులు కలుపు కుని 810 బస్సులు నడిపించనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నుంచి జేబీఎస్‌కు 12వ తేదీన 30 బస్సు లు, 13న 180 బస్సులు, 14న 180 బస్సులు, 15న 110 బస్సులు, 16న 50, 17న 40, 18న 30, 19న 30, 20న 100 బస్సులు 21న 100 బస్సులు మొత్తం 850 బస్సులు నడిపిస్తున్నామన్నారు. ఈ ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం ఉంటుంద న్నారు. ప్రయాణికులు ఆర్టీసీ వెబ్‌సైట్‌ను సందర్శించి టికెట్లు రిజర్వు చేసుకోవాలన్నారు.

వివాహిత ఆత్మహత్య సంఘటనలో ఐదుగురిపై కేసు

జగిత్యాల క్రైం, అక్టోబరు 2 : జిల్లా కేంద్రంలోని ఎలుకబావి వాడకు చెందిన రాపెల్లి సౌమ్య(26) అనే వివాహిత ఆత్మహత్య కేసులో ఐదుగురిపై బుధ వారం కేసు నమోదు అయింది. సౌమ్య మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా, అదనపు వరకట్నం వేధింపులతోనే తన కూతురు ఆత్మహత్యకు పాల్పడ్డట్లు మృతురాలి తల్లిదండ్రులు పోలీ సులకు బుధవారం ఫిర్యాదు చేశారు. ఈ విషయంలో జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ ఆధ్వర్యంలో పోలీసులు విచారణ చేపట్టారు. మృతికి కారణమైన భర్త రాజేష్ పాటు అతని తల్లిదండ్రులు వరలక్ష్మి- సుదర్శన్, సోదరి-బావ రోజ-శేఖర్‌లపై పోలీసులు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. వివాహిత ఆత్మహత్యకు ముందు తనకు జరిగిన అన్యాయాన్ని డైరీలో రాసి ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తెలిసింది. డైరీని పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

చింతకుంటలో యువకుడి అదృశ్యం

కథలాపూర్, అక్టోబరు 2 : మండలంలోని చింతకుంటకు చెందిన దండి మల్లేశ్ (30) అనే యువకుడు అదృశ్యమయ్యాడు. మల్లేశ్ మంగళవారం సాయంత్రం ఓ శుభకార్యానికి వెళ్లి ఇంటికి తిరుగు ప్రయాణం అయ్యాడు. రాత్రి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ రావడంతో కలవరపడ్డారు. బుధవారం ఉదయం కథలాపూర్-దుంపెట గ్రామాల మధ్య ఉన్న వరద కాలువ వంతెన వద్ద బైక్ కని పించడంతో పలువురు పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై నవీన్ పరిశీలించగా నంబర్ ప్లేట్ ఒక చోట పడి ఉండగా బైక్ వరద కాలువ ఒడ్డుకు పడి కనిపించింది. అయితే మల్లేశం ఆచూకీ మాత్రం లభ్యం కాలేదు. హత్య కోణంలో డీఎస్పీ ఉమామహేశ్వర్‌రావు, కోరుట్ల సీఐ, ఎస్సైలు విచారణ జరుపుతున్నట్టు సమాచారం. మల్లేశ్‌ను హత్య చేసి వరదకాలువలో పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లా బాక్సింగ్ పోటీలకు స్పందన



బాక్సింగ్ పోటీలను ప్రారంభిస్తున్న టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, అక్టోబరు 2 : కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా బాక్సింగ్ ఎంపిక పోటీలకు విశేష స్పందన లభించింది. జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల పోటీలకు ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రదేశాల నుంచి 125మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీలను టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో రాణించాలన్నారు. అనంతరం పోటీలను నిర్వహించి ఈనెల 5,6 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించ నున్న రాష్ట్రస్థాయి పోటీలకు ప్రతిభ చాటిన క్రీడాకారులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్, జగిత్యాల జిల్లాల బాక్సింగ్ సంఘాల ప్రధాన కార్యదర్శులు కొత్తకొండ సంపత్‌కుమార్, జి శ్రీనివాస్, డీవైఎస్‌వో శ్రీనివాస్, టీజీవో నాయకులు మడిపెల్లి కాళీచరణ్, టీఎన్‌జీవో నాయకులు హర్మిందర్‌సింగ్, బాక్సింగ్ సంఘం ప్రతినిధులు జి సత్యనారాయణ, జి మురళి, గోల్కొండ శ్రీరామ్, ప్రదీప్, కోచ్ వికాస్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

జూనియర్ విభాగంలో ఎస్ అబ్దుల్ రహీం, శ్రీలక్ష్మీనర్సింహ, షేక్ ఇబ్రహీం, ఎండి అమన్ పాష, తనీష్‌రాజ్, కె రామ్‌చరణ్, పి సాకేత్, పి సుకుమార్, జాయిద్‌ఎర్త్, మనిహాస్‌గోరే, ఆకుల మణిచరణ్ ఎంపికయ్యారు. సబ్ జూనియర్ విభాగంలో సాదిక్, జె శివశంకర్, రాఘవ్, ఆద్విత్, శివ, పి అనుమల్‌రెడ్డి, రూపక్, పి శివకుమార్, కె రేవంత్, సి వరుణ్, ఎం వర్షిత్, జి సాయిమణి, బి అభిక్షిత్, కె తేజస్విని, ఎస్ స్వరాశి, టి మనశ్రీ, హంసిక, సిమ్రితరెడ్డి, ఎం నిధి, ఎం నక్షత్ర ఎంపికయ్యారు.

ఎస్సారెస్పీకి 17,860 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

జగిత్యాల, అక్టోబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు 17,860 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 80.5 సామర్థ్యానికి ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాగా మిషన్ భగీరథ, సాగునీటి కాలువలు, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 17,860 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. వరద కాలువకు 12,000 క్యూసె క్కులు, ఎస్కేప్ గేట్ల ద్వారా దిగువకు 4,000 క్యూసె క్కులు, లక్ష్మీ కాలువకు 150 క్యూసెక్కులు, సరస్వతీ కాలువకు 500 క్యూసెక్కులు, గుత్పా ఎత్తిపోతల పథకానికి 270 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల అవుతుండగా 709 క్యూసెక్కుల నీరు ఆవిరి అవుతోంది.

కాలం చెల్లిన బస్సులతో ఇబ్బందులు



హుజూరాబాద్ బస్టాండ్‌లో బస్సును తోస్తున్న ప్రయాణికులు

హుజూరాబాద్ ఆర్టీసీ డిపోలో కాలం చెల్లిన బస్సులు ఉండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం హుజూరాబాద్ బస్టాండ్‌లో జమ్మికుంటకు వెళ్లే మినీ బస్సు స్టార్ట్ కాలేదు. దీంతో ప్రయాణికులు బస్సును తోశారు. కొద్ది దూరం తోసిన తర్వాత బస్సు స్టార్ట్ అయ్యింది. కొన్ని రోజులుగా హుజూరాబాద్ డిపోలో బస్సులు తరుచూ రిపేరు వస్తుండడంతో మధ్యలోనే ప్రయాణికులను దించేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సులను మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- హుజూరాబాద్

క్రైం కార్నర్

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 2: మండలంలోని ఆరేపల్లి శివారులో ఎస్సారెస్పీ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ విషయంపై చుట్టుపక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. శవం ఎక్కడ నుంచి కొట్టుకువచ్చిందనే విషయంపై స్థానిక పోలీసులు ఆరాతీస్తున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి ఆత్మహత్య

ఓదెల, అక్టోబరు 2 : మండల కేంద్రానికి చెందిన ముద్దసాని సమ్మయ్య(45) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. పొత్కపల్లి పోలీసులకు మృతుని భార్య స్వరూప ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. వివాహం అయినప్పటి నుంచి సంతానం కలగడం లేదని సమ్మయ్య తాగుడుకు బానిసయ్యాడు. నాలుగు రోజుల క్రితం ఇంటిలో పురుగుల మందు తాగగా కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్ఐ అశోక్‌రెడ్డి తెలిపారు. కాగా, సమ్మయ్య నేత్రాలను కుటుంబ సభ్యులు సదాశయ ఫౌండేషన్‌కు దానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జాతీయ కార్యదర్శి మేర్గు భీష్మచారి, మాజీ ఎంపీటీసీ బోడకుంట శంకర్, మాజీ ఉపసర్పంచ్ తీర్థాల కుమార్, గొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇద్దరు ఆకతాయిలను పట్టుకున్న షీ టీమ్

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 2: ఇల్లంతకుంట ప్రభుత్వ కళాశాల బైక్‌లపై ర్యాష్ డ్రైవ్ చేస్తూ విద్యార్థినులను ఇబ్బందులకు గురి చేస్తున్న ఇద్దరు ఆకతాయిలను షీటీమ్ పట్టుకున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. పక్కా సమాచారం మేరకు షీటీమ్ సభ్యులు మఫ్టీలో కళాశాల వద్ద నిఘా పెట్టినట్లు, ఇద్దరు పోకిరీలను అదుపులోనికి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. మహిళలను, విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మహిళలు, చిన్న పిల్లల రక్షణ విషయంలో జిల్లా పోలీసుశాఖ పటిష్ఠమైన చర్యలు చేపట్టిందని తెలిపారు. జిల్లాలో విద్యాసంస్థల వద్ద, రద్దీ ప్రదేశాల్లో షీటీమ్ సిబ్బంది మఫ్టీలో నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సంవత్సరం మహిళలను, విద్యార్థినులను వేధించిన 37 మంది పోకిరీలపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. మరో 42 పెట్టీ కేసులు నమోదు చేసి తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించామని పేర్కొన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్నా జిల్లా షీటీమ్ నంబరు 8712656425కు లేదా 100కు డయల్ చేయాలని సూచించారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు 2 : ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన అవినాష్ అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బుధవారం హైదరాబాద్‌లో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామంలోని రమ్య- రవి దంపతుల చిన్న కొడుకు అవినాష్ హైదరాబాద్‌లోని ఓ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా కొనసాగుతున్నాడు. పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడని అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందడంతో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు. ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు.

ఇసుక లారీ, ట్రాక్టర్ సీజ్

తంగళ్లపల్లి, అక్టోబరు 2 : తంగళ్లపల్లి మండలం పద్మనగర్ శివారులో అనుమతి లేని ఇసుక లారీ, ట్రాక్టర్‌ను బుధవారం సీజ్ చేసినట్లు, ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు. పద్మనగర్ శివారులో లారీలో నుంచి ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్, లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న శివరాత్రి రాజు, కొంపల్లి బాలకిషన్, కంచర్ల బాలరాజును రిమాండ్‌కి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

లక్కీడ్రా నిర్వాహకులపై కేసు

వేములవాడ, అక్టోబర్ 2 : దసరా పండగ సందర్భంగా వంద కొట్టు.. మేకను పట్టు.. అంటూ అమాయక ప్రజలను మోసం చేస్తున్న లక్కీ డ్రా నిర్వాహకులపై కేసు నమోదు చేశామని వేములవాడ ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. పండగ సందర్భంగా ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నగదు దండుకొని డ్రాలు నిర్వహిస్తామని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్నారని తెలిపారు. చీటీలు, ప్రైజ్ మనీ పేరుతో మోసపోవద్దని ప్రజలకు సూచించారు. సామాజిక మాధ్యమాల ద్వారా వందకొట్టు మేకను పట్టు అంటూ లక్కీ డ్రా పేరిట ప్రచారం చేసుకుంటున్న నిర్వాహకులు శ్రీకాంత్, ప్రశాంత్, మహేందర్, వెంకటేశ్, స్వామిపై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కొడిమ్యాల, అక్టోబరు 2 : మండల కేంద్రానికి చెందిన పురుషోత్తం శ్రీనివాస్ అనే గీతాకార్మికుడు బుధవారం సాయంత్రం ఈత చెట్టుపై నుంచి పడి చేతికి, కాలుకు, నడుముకు గాయాల పాలైనట్లు తోటి గీతా కార్మికులు తెలిపారు. గ్రామ శివారులోని ఈత చెట్ల వద్దకు కల్లు గీయటానికి వెళ్లి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న క్రమంలో కిందపడినట్లు తెలిపారు. గాయపడిన శ్రీనివాస్‌ను జగిత్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన సోదరుడు పురుషోత్తం పర్శరాములు తెలిపాడు.

గ్రామ పంచాయతీ కార్మికుడికి విద్యుదాఘాతంతో గాయాలు



గాయపడిన జీపీ కార్మికుడు గుండేటి రాజు

వీణవంక, అక్టోబరు 2: మండలంలోని మామిడాలపల్లి గ్రామ పంచాయతీ కార్మికుడు గుండేటి రాజు విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామంలో విద్యుత్ బల్బులు అమరుస్తుండగా విద్యుత్ సరఫరా జరిగింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన రాజు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్థులు రాజును చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.


గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీజేపీ నాయకులు


నివాళులర్పిస్తున్న ఆర్జీ-2 టీబీజీకేఎస్ నాయకులు

ఘనంగా గాంధీ జయంతి


పెద్దపల్లిలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో శ్రీధర్


సుల్తానాబాద్‌లో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ లక్ష్మి


ముత్తారంలో నివాళులర్పిస్తున్న నాయకులు


మంగపేటలో నివాళులర్పిస్తున్న సారయ్యగౌడ్


కమాన్‌పూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 2 : మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. పెద్దపల్లి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్, ఎంపీవో ఫయాజ్, ఏపీవో రమేష్ బాబు, ఈజీఎస్ జేఈ రాజయ్య తో పాటు పలువురు పాల్గొన్నారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. దీంతో 30 గ్రామాల్లోని పంచాయతీ కార్యాలయాల్లో జయంతి వేడుకలను పంచాయతీ కార్యదర్శులు ఘనంగా నిర్వహించారు.

ముత్తారం : ముత్తారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మహాత్మా గాంధీ జయంతి కార్యక్రమం మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేడీసీసీ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, ముత్తారం మండలం మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్మోహన్‌రావు, మండల మహిళ అధ్యక్షురాలు గోవిందుల పద్మ ఆనంద్,కిసాన్ సెల్ మండల అధ్యక్షులు గాదం శ్రీనివాస్, బొల్లినేని బుచ్చమ్ రావ్,సోషల్ మీడియా మండల ఇంచార్జి కోల విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి చంద్రమౌళి,ఆకోజు అశోక్,తీగల సత్యనారాయణ రావు,డాక్టర్ రాజయ్య, పర్స శ్రీనివాస్,లక్కం ప్రభాకర్,మీనుగు శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామపంచాయతీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ గర్రెపల్లి శంకర్, మాజీ ఎంపీపీలు గోపగోని సారయ్య గౌడ్, నూనేటి సంపత్, ఆయా పార్టీల నాయకులు గాదనవేన సదయ్య, పోశాల సదానందం, రామిడి తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓదెల : మండల రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో బుధవారం మహాత్మా గాంధీ జయంతి వేడుకలను నిర్వహించారు. అలాగే మండలంలోని వివిధ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ యాకయ్య మాట్లాడుతూ,సత్యాగ్రహమే ఆయుధంగా పోరాడి భారతీయులందరికీ స్వతంత్రాన్ని అందించిన గొప్ప అహింస వాది గాంధీ మహాత్ముడని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో తిరుపతి, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సుల్తానాబాద్ : మహాత్మాగాంధీ జయంతి కార్యక్రమాన్ని సుల్తానాబాద్‌లో ఘనంగా జరుపుకున్నారు. సుల్తానాబాద్ మున్సిపల్ ఆఫీసులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి మున్సిపల్ చైర్ పర్సన్ గాజుల లక్ష్మీ రాజమల్లు తదితరులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. గాంధీనగర్‌లోగల గాంధీ విగ్రహం వద్ద కూడా జయంతి వేడుకల్లో బాగంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాశ్‌రావు, అన్నయ్యగౌడ్, దుగ్యాల సంతోష్ రావు, అరుణ బాబురావు, బిరుదు క్రిష్ణ, రాజయ్య, కూకట్ల గోపి, తిరుపతి, గుర్రాల శ్రీనివాస్, రఫీ, గొట్టం మహేష్, పల్లా సురేష్, నన్ను, గాజుల అరుణ్, మున్సిపల్ మేనేజర్ అలీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. సుల్తానాబాద్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. గౌరవ అధ్యక్షులు కొమురవెళ్లి రాంమూర్తి, అధ్యక్షులు భాస్కర్, సెక్రటరీ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రభుత్వ అసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.

రామగిరి : మహాత్మగాంధీ జయంతి వేడుకలను బుధవారం మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ భవనంలో ఎంపీడీవో శైలజారాణి గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళి అర్పించారు. ఆదివారంపేట్, ఐఎన్‌టీయుసీ కార్యాలయంలో కాంగ్రెస్ శ్రేణులు జాతిపితకు ఘన నివాళి ఆర్పించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో నాయకులు తొటచంద్రయ్య, కాటంసత్యం, మట్ట రాజ్‌కుమార్, షైదంభారతి, వరప్రసాద్, అదికారులు పాల్గోన్నారు.

ఎలిగేడు : మండలంలోని తహసీల్దార్, ఎంపీడీఓ వ్యవసాయ, ఐకేపీ, పీహెచ్‌సీ, పోస్టాఫీస్, ఎలిగేడు, ధూళికట్ట పీఏసీఎస్‌లతో పాటు 12 గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో మంగళవారం భారతజాతిపిత మహాత్మాగాంధీ జయంది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళలర్పించారు. ఈ కార్యక్రమంలో బషీరొద్దీన్, భాస్కర్‌రావు, ఉమాపతి, సుధాకర్, నిస్సిక్రిష్టాన, గోపు విజయభాస్కర్‌రెడ్డి, పుల్లూరి వేణుగోపాల్‌రావు, కార్యదర్శులు అంజలి, హరిబాబు, పాపన్న, లలిత, పున్నమయ్య, శివకుమార్, శ్రావణ్‌కుమార్ శిరీష్, మహ్మద్ మైనొద్దీన్, మహేష్, సురేష్, ఐకేపీసీసీలు ఆనంద్, జ్యోతి, మల్లేశం, వీవోఏ, హెల్త్ సిబ్బంది, అంగన్‌వాడీ, టీచర్స్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్ : గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వైనాల రాజు, జిల్లా సెక్రెటరీ సయ్యద్ అన్వర్, మండల ప్రధాన కార్యదర్శి మల్యాల తిరుపతి, పీఏసీఎస్ చైర్మన్ ఇనగంటి భాస్కర్ రావు, మాజీ ఎంపీపీలు మల్యాల రాంచంద్రంగౌడ్, కోలేటి మారుతి, మాజీ సర్పంచ్‌లు కట్కం రవీందర్, బొల్లపల్లి శంకర్‌గౌడ్, ఆకుల ఓదెలు, మాజీ ఎంపీటీసీలు బొల్లంపల్లి తిరుపతిగౌడ్, శంకరయ్య, నాయకులు రంగు సత్యనారాయణ గౌడ్, గాండ్ల మోహన్, కుక్క రవిందర్, చొప్పరి శేఖర్, గడప కృష్ణమూర్తి, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

జూలపల్లి : మండలకేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామపంచాయతీల్లో బుధవారం జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలను అధికారులు ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. గ్రామపంచాయతీ కార్యాలయాల్లో కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలపంచాయతీ అధికారి అనిల్‌రెడ్డి, ఏపీవో సదానందం, సింగిల్‌విండో చైర్మన్ కొంజర్ల వెంకటయ్య, బీజేపీ నాయకులు కొప్పుల మహేష్, పంచాయతీ కార్యదర్శులు ఎండి ముజీబ్, విజయాఅజ్మీర, పలువురు ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కళ్యాణ్‌నగర్/మార్కండేయకాలనీ : గాంధీ జయంతి సందర్భంగా బుధవారం చౌరస్తాలో గాంధీ విగ్రహానికి రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, గోదావరిఖని ఏసీపీ రమేష్ కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, చుక్కల శ్రీనివాస్, కొప్పుల శంకర్, గడ్డం శ్రీనివాస్, దూళికట్ట సతీష్, సుతారి లక్ష్మణ్ బాబు, దాసరి సాంబమూర్తి, యాకూబ్, బొమ్మక రాజేష్ పాల్గొన్నారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో గాంధీ జయంతి సందర్భంగా సూపరింటెండెంట్ దయాల్‌సింగ్ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైద్యులు మనుంజయ్, రేణుక, రవి వర్మ, నర్సింగ్ సూపరింటెండెంట్లు వసుంధర, సౌందర్య పాల్గొన్నారు. చౌరస్తాలోని గాంధీ విగ్రహానికి బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి నివాళులర్పించారు. క్యాతం వెంకటరమణ, పిడుగు కృష్ణ, కోడూరి రమేష్, నవీన్, మామిడి వీరేశం పాల్గొన్నారు. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి గోపు ఐలయ్యయాదవ్ నివాళులర్పించారు. బొడ్డు రవీందర్, తోడేటి శంకర్, జక్కుల తిరుపతి, సట్టు శ్రీనివాస్, కోడి రామకృష్ణ, ఇరుగురాళ్ల శ్రావణ్ పాల్గొన్నారు. టీడీపీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. నిమ్మకాయల ఏడుకొండలు, దామోదర్‌రెడ్డి, గుండబోయిన ఓదెలు, అంకిరెడ్డి పాల్గొన్నారు. ఎన్‌సీపీ ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గోలివాడ ప్రసన్న, శ్రీధర్, నాగరాజు, మహేష్ పాల్గొన్నారు.

జ్యోతినగర్ : ఎన్‌టీపీసీలో బుధవారం గాంధీ జయంతిని యాజమాన్యం ఘనంగా నిర్వహించింది. ఉదయం సామూహిక మార్నింగ్ వాక్ నిర్వహించి టౌన్‌షిప్‌లో అధికారులు మొక్కలు నాటారు. మహాత్మా గాంధీ స్టేడియంలో జరిగిన జయంతి ఉత్సవాల్లో ఎన్‌టీపీసీ ఈడీ కేదార్ రంజన్‌పాండు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎన్‌టీపీసీ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ : మహాత్మా గాంధీ జయంతిని బుధవారం కాలనీలో ఘనంగా నిర్వహించాయి. కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుండేటి రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్‌రావు, బత్తిని శ్రీనివాస్, శనిగరం తిరుపతి, తిరుపతిరెడ్డి, అనుము రాములు, సారయ్య నాయక్, అవినాష్ పాల్గొన్నారు. మహాత్మా గాంధీనగర్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. నూక రమేష్, అనంతుల రాజు, సత్యనారాయణ, సతీష్‌కుమార్, సంపత్, శ్రీనివాస్, దేవయ్య, నవీన్‌కుమార్, గుండా అశోక్, రాజేందర్, సత్యం, కృష్ణమూర్తి, సాంబమూర్తి, సంతోష్‌కుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్జీ-2లో..

మహాత్మాగాంధీ జయంతిని పురస్కరించుకుని బుధవారం ఆర్జీ-2 ఏరియా కార్మిక సంఘాల నాయకులు అయనకు నివాళులు అర్పించారు. టీబీజీకేఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏరియా వైస్ ప్రెసిడెంట్ అయిలి శ్రీనివాస్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బేతి చంద్రయ్య, అనిల్‌రెడ్డి, మల్లేశ్వరరావు, జాడి వెంకటి, తిరుపతి, రాజిరెడ్డి, నరేష్ పాల్గొన్నారు. ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి మహాత్ముని చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కండేయ, దశరథం, ఆకుల రాజయ్య, సైదులు, సీహెచ్ కృష్ణ పాల్గొన్నారు.


ఓదెలలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్


రామగిరిలో నివాళులర్పిస్తున్న ఎంపీడీవో


ఎలిగేడులో..

గుండెపోటుతో కార్పొరేషన్ ఉద్యోగి మృతి

కోల్‌సిటీ, అక్టోబరు 2: రామగుండం నగరపాలక సంస్థలోని జనన, మరణ ధ్రువీకరణ పత్రాల విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మాదేసి శ్రీనివాస్(38) బుధవారం రాత్రి గుండెపోటుతో మృతిచెందాడు. రామగుండంలో నివాసముండే శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యంతో గురవడంతో కుటుంబ సభ్యులు గోదావరిఖని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఫిట్స్‌తో ఆసుపత్రిలో చేరిన శ్రీనినావాస్‌కు గుండె పోటురావడంతో మృతిచెందినట్లు వైద్యులు పేర్కొన్నారు. వికలాంగుడైన శ్రీనివాస్ కొన్నేళ్లుగా కార్పొరేషన్‌లో పనిచేస్తున్నారు. శ్రీనివాస్ రామగుండం ప్రాంతంలో సుపరిచితుడైన నారాయణసార్ కుమారుడు. అతని మృతిపట్ల నగర పాలక సంస్థ ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఖనిలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 2: గాంధీ జయంతి సందర్భంగా రామగుండం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు.స్థానిక ప్రధానచౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మాజీ డిస్టిక్ గవర్నర్ హనుమాండ్ల రాజిరెడ్డి , ప్రమోద్‌కుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉచితంగా సుమారు 200 మందికి షుగర్ పరీక్షలు నిర్వహించారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందికి గొడుగులు పంపిణీ చేశారు. లయన్స్‌భవన్‌లో విద్యార్థులకు నోట్‌బుక్స్, బ్యాగ్‌లు అందజేశారు. సీనియర్ లయన్ సభ్యుడు బి లక్ష్మారెడ్డి సహకారంతో బీటెక్ చదువుతున్న పేద విద్యార్థికి రూ.20వేలు అందజేశారు. పేదలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పి.మల్లిఖార్జున్, కార్యదర్శి వి.ఎల్లప్ప, కోశాధికారి గోవర్ధన్‌రెడ్డి, సీనియర్ సభ్యులు కోదండరాం, బద్వేషం, వెంకటరమణారెడ్డి, మీల్స్ ఆన్ వీల్స్ కోఆర్డినేటర్ బంక రామస్వామి, జోనల్ చైర్మన్ కె.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

- రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


పారిశుధ్య కార్మికుడిని సన్మానిస్తున్న చైర్‌పర్సన్ పెంద్రి రమ

కోల్‌సిటీ, అక్టోబరు 2: పారిశుధ్య కార్మికులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సూచించారు. బుధవారం గాంధీ జయంతి సందర్భంగా నగరపాలక సంస్థ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా పారిశుధ్య కార్మికులు చిలుక రమేష్, ఎల్లయ్య తదితరులను సత్కరించారు. వారి సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాలు అందించారు. ప్రతిఒక్కరూ విధి నిర్వహణలో బాధ్యతయుతంగా మెలగాలన్నారు. మహాత్ముడు పారిశుధ్యంపై ఎంతో శ్రద్ధ పెట్టేవారని, ఆయనను ఆదర్శంగా తీసుకుని నగరం చెత్త రహితంగా ఉండేటట్టు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. మేయర్ అనీల్‌కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ముస్తాఫా, అధికారులు, ప్రజా ప్రతినిధు లు పాల్గొన్నారు.

మంథని : గాంధీజీ ఆశయాలను కొనసాగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి, వైశ్య సంఘం నేత నల్మాసు ప్రభాకర్, కాంగ్రెస్ నేతలు పూలమాల వేసి ఘనంగా వేర్వేరుగా బుధవారం నివాళులర్పించారు.అలాగే మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ పెంద్రి రమ-సురేష్‌రెడ్డి పారిశుధ్య కార్మికులను సన్మానించి సర్టిఫికెట్లు అందజేశారు.

యైటింక్లయిన్‌కాలనీ : మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రతి సింగరేణి ఉద్యోగి పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా స్పెషల్ క్యాంపెయిన్ 4.0 రెండవ దశ కార్యక్రమాన్ని బుధవారం జీఎం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వీకేపీ ప్రాజెక్టు అధికారి నెహ్రూ, నోడల్ అధికారి అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్, డీజీఎం పర్సనల్ అనిల్‌కుమార్, అధికారులు ధనుంజయ, ఎర్రన్న, సృజన్‌మెహ్రా, షరీఫ్ మహమ్మద్, డా. మహిపాల్, బుక్యదేశాయి, చంద్రశేఖర్, వినయ్‌సాగర్, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రామసభలు..

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 2 : గాంధీ జయంతిని పురస్కరించుకొని మండలంలోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా చేయాల్సిన పనులపై గ్రామసభలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఫీల్డ్ అసి స్టెంట్‌లు, సీఏలు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో బుధవారం గాంధీ జయంతి సందర్భంగా గ్రామసభలు నిర్వహించారు. బతకమ్మ, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాట్ల గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామాల ప్రత్యేక అధికారులు రామ్మోహన చారి, గోవర్ధన్, సురేష్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

బిల్ కలెక్టర్‌పై ఫిర్యాదు

ముత్తారం, అక్టోబరు 2: మండలంలోని ఖమ్మంపల్లి గ్రామపంచాయతీ బిల్లు కలెక్టర్ మనోజ్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు గ్రామానికి చెందిన బొల్లంపల్లి సంతోష్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లాలోని మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామంలో నివాసం ఉంటూ అక్కడి నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారని, విధులకు సమయ పాలన పాటించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. మధ్యాహ్నం 12గంటలకు వచ్చి 2 గంటలకు తిరిగి వెళ్తున్నారని తెలిపాడు. కార్యాలయానికి వచ్చిన సమయంలో కూడా నిత్యం ఫోన్లు మాట్లాడుకుంటూ కాలయాపన చేస్తున్నాడని ఫిర్యాదు చేశాడు. ప్రజలకు అందుబాటులో ఉండకుండా విధుల్లో అలసత్వం వహిస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని తెలిపారు.

మృతుడికి ఘన నివాళి

ముత్తారం, అక్టోబరు 2: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తూటి రఫీ తండ్రి బుచ్చయ్య మరణించగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు మాజీ జడ్పీటీసీ చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షులు దొడ్డ బాలాజీ సందర్శించి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నాగినేని జగన్‌మోహన్‌రావు, కేడీసీసీ చైర్మన్ అల్లాడి యాదగిరిరావు, యువజన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, కిసాన్ సెల్ మండలాధ్యక్షుడు గాదం శ్రీనివాస్, కోల విజయ్, బొల్నేని బుచ్చంరావు, ఆల్గం సంపత్, జక్కుల రమేష్,దాసరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

రవి యాదవ్‌కు నేషనల్ యూనిక్ అవార్డు


అవార్డు అందుకుంటున్న రవి యాదవ్

ముత్తారం, అక్టోబరు 2: ముత్తారం మండలం లక్కారం గ్రామానికి చెందిన రవియాదవ్ నేషనల్ యూనిక్ అవార్డు-2024 అందుకున్నాడు. తిరుపతిలోని స్వరాని కల్చరల్ ఆర్ట్స్ అకాడమీ, స్నేహ కల్చరల్ పార్ట్ అకాడమీ వారు నిర్వహించిన కార్యక్రమంలో రవికి లక్ష్మణుడి పాత్రలో నైపుణ్యాన్ని ప్రదర్శించినందుకు నేషనల్ యూనిక్ అవార్డు అందించారు. రవిని మాజీ ఎంపీపీ చంద్రమౌళి అభినందించారు.

గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 2: గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ గోపాగోని సారయ్యగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని ఆశన్నపల్లి నుంచి మంగపేటవాగు రహదారికి రూ.2లక్షల నిధులు, అంకంపల్లి నుంచి దావనపల్లి వరకు రూ.2లక్షలతో రహదారుల మరమ్మతులకు సారయ్యగౌడ్ స్థానిక నాయకులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లడ్ డ్యామేజీ కింద రహదారుల మరమతులకు ఎమ్మెల్యే విజయ రమణారావు మండలానికి రూ.10లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. రహదారుల నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు సారయ్యగౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు సదయ్య, రామిడి తిరుపతిరెడ్డి, మొగిలి సదానందం, మాదాసి సతీష్, మంద వెంకన్న, గాజుల మోహన్, శ్రీనివాస్, రమేష్, సంపత్ పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్జున్‌కు అవార్డు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 2: మండలంలోని నిమ్మనపల్లి గ్రామానికి చెందిన కరీంనగర్ ఎస్ఆర్ఆర్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న కాంపల్లి అర్జున్ విద్యారత్న నేషనల్ అవార్డుకు ఎంపికైనట్లు బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అవార్డు కమిటీ ప్రకటించింది. అవార్డు సెలక్షన్ కమిటీ నేషనల్ చైర్మన్, జాతీయ అధ్యక్షులు నల్ల రాధాకృష్ణ అవార్డు ఆహ్వాన పత్రాన్ని హైదరాబాద్‌లోని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో అర్జున్‌కు అందజేశారు. 6న తిరుపతిలో అవార్డును అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గౌతమ్, రాష్ట్ర కోఆర్డినేటర్ విష్ణు, కమిటీ మెంబర్ వెంకటేశం పాల్గొన్నారు.

గట్టుసింగారం జలపాతం వరకు మట్టి రోడ్డు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు2: మండలంలోని సబ్బితం గ్రామ పంచాయతీ పరిధిలో గట్టుసింగారం జలపాతం వెళ్లే దారి పూర్తిగా గుంతల మయం కాగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అత్యవసర పనుల కింద 5 లక్షల రూపాయలు కేటాయించారు. బుధవారం గ్రామ మాజీ సర్పంచ్ చంద శంకర్, యూత్ కాంగ్రెస్ నాయకులు కందుల అశోక్‌లు చేపడుతున్న పనులను పరిశీలించారు.

వృద్ధులను సన్మానించిన అధికారులు

పెద్దపల్లి రూరల్, అక్టోబరు 2: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవంలో భాగంగా బుధవారం మండలంలోని కాపులపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామంలోని వృద్ధులను ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మండల విద్యాధికారి సురేంద్రకుమార్, మాజీ ఎంపీటీసీ ఎడెల్లి శంకర్, పంచాయతీ కార్యదర్శి పాష పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

కాల్వశ్రీరాంపూర్, అక్టోబరు 2: దసరా ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలని సీఐ సుబ్బారెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం ముందు బుధవారం గ్రామస్తులతో దసరా ఉత్సవాల సందర్భంగా సమావేశం నిర్వహించారు. అనంతరం సీఐతో పాటు పలువురి అధికారులను పురోహి తుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నిట్టూరి సతీష్ శర్మ సన్మానించారు. డిప్యూటీ తాసిల్దార్ గర్రెపల్లి శంకర్, ఎంపీ ఓ గోవర్ధన్, ఎస్సై వెంకటేష్, గ్రామ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగులకు ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 2: గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆర్జీ-1 పరిధిలోని జీడీకే1ఇంక్లైన్ ఉద్యోగులకు నిర్వహించిన ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ పోటీలను ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి మడ్డి ఎల్లయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రంగు శ్రీనివాస్, ఆర్గనైజర్ మల్లికార్జున్, రమేష్, నరేష్, వినయ్‌కుమార్, భరత్, పాల్గొన్నారు.

ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మి

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 2: ఐద్వా జిల్లా అధ్యక్షురాలిగా భాగ్యలక్ష్మీ, కార్యదర్శిగా మహేశ్వరిని ఎన్నుకున్నారు. మంగళవారం గోదావరిఖని శ్రామిక భవన్‌లో జరిగిన ఐద్వా 3వ మహాసభల్లో నూతన కమిటీని రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, కార్యదర్శి మల్లు లక్ష్మి ప్రకటించారు. వీరితో పాటు 13మందితో జిల్లా కమిటీని ఏర్పాటు చేశారు.

ఖనిలో భారీ వర్షం

కళ్యాణ్‌నగర్, అక్టోబరు 2: వారం రోజులుగా పారిశ్రామిక ప్రాంతంలో ఉక్కిరిబిక్కిరి అవుతుండగా బుధవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. అకస్మాత్తుగా ఆకాశం కారుమబ్బులు కమ్ముకుని వర్షం కురిసింది. ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా వివిధ గ్రామాల నుంచి పూలు అమ్ముకోవడానికి వచ్చిన వారు వర్షంతో ఇబ్బందులు పడ్డారు.

సీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ

కోల్‌సిటీటౌన్, అక్టోబర్ 2: సివిల్ సొసైటీ ఫోరం ఆధ్వర్యంలో బుధవారం గోదావరిఖనిలో పీస్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక ప్రధానచౌరస్తాలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామగుండం సివిల్ సొసైటీ ఫోరం బాధ్యులు ముడుతనపెల్లి సారయ్య, లక్కం బిక్షపతి, ముకుందరెడ్డి, ఎం.విజయానంద్, విజయ్‌కుమార్‌గౌడ్, సురేందర్‌రెడ్డి,ముచ్చకుర్తి చంద్రమౌళి, రవికిరణ్, తోట వేణు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతూ మహిళ మృతి

ముత్తారం, అక్టోబరు 2: ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. మండలంలోని లక్కారంలో బతుకమ్మ ఆడుతుండగా మాదాసి స్వరూప(49) అనే మహిళ ఒక్కసారిగా కుప్పకూలి అక్కడికక్కడే మృతిచెందింది. స్వరూపకు మూడు నెలల క్రితం మెదడు సంబంధిత వ్యాధి ఉన్నట్లు వైద్యుల నిర్ధారించారని కుటుంబ సభ్యులు తెలిపారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో అప్పన్నపేట విద్యార్థి ప్రతిభ

పెద్దపల్లి రూరల్, అక్టోబరు2: ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని అప్పన్నపేట జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి ఎ.మణికంఠ ఎంపికయ్యారు. ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం అభినందించారు.